## ౨

పదకొండుగంటలు కొట్టటంతోనే పట్టుబట్ట కట్టుకొని భోజనానికి తయారయినాను. ఇల్లు స్వర్గతుల్యంగా ఉంది. కాంతం ముఖం కార్తిక జ్యోత్స్నలను వెదజల్లుతున్నది. దుఃఖమేఘములు పటాపంచలైపోయినవి. చెంబులు తెల్లబడి వెండిచెంబులులాగ మెరుస్తున్నవి. బట్టలు పువ్వుల్లాగ ఉతికిపెట్టింది. పీటలు కడిగింది. ఇల్లు అద్దంలాగ ఉంది. పుస్తకాలు చక్కగా బొత్తులుపెట్టి ఉన్నవి. ఎంతలో ఎంతమార్పు జరిగిందా అని ఆశ్చర్యంవేసింది. దేవతాసహాయంవల్ల జరిగిందా ఇదంతా లేక మాయా అని అనిపించింది. ఈపనిఅంతా గంటలో జరిగింది. పైగా వంట ఆరోజు చక్కగా చేసింది. కూరలు అవీ చాలా కమ్మగా ఉన్నవి.

ముకుళితకుసుమము వాయుచుంబనంచేత వికసించింది. చిరుకెరటాలను మలయపవనుడు ముద్దెట్టుకొంటే సంతోషంతో ఎగురుచున్నవి. వసంతునిచే ముద్దిడబడి పుష్పచయమంతా వికసిస్తున్నవి. ఈ చంద్రకాంతాన్ని ఏది వికసింపజేసింది? అని నాప్రశ్న.

# మరియొక రోజు

కాంతంతో ఆరోజు పోట్లాడాను. ఘోరమైన యుద్ధం జరిగిపోయింది. ఈబతుకుబతికేకంటె చావునయం అనిపించింది. చావటానికి నిశ్చయించుకొన్నాను. ఆరోజుననే నాకు లోకం మీద కూడా కోపంవచ్చింది. లోకంలో చాలామంది శత్రువులు కనిపించారు. లోకంలో సంతోషం ఇచ్చే పదార్థ ఒకటి కనిపించలేదు. మానవజన్మ దుఃఖభూయిష్టంగా కనిపించింది. ఇంతటితో ఈ అవతారం చాలిద్దామని తోచింది.

నేనేచస్తే! మావాళ్ళంతా ఏమవుతారు! ముందుమాగోష్టి. వారికి నాచావు వజ్రాయుధంలాగ తగులుతుంది. కొంతమంది జాలిగుండె కలవాళ్ళు ఏడుస్తారు. కొంతమంది భరించి ధైర్యంతో ఊరుకొంటారు. వారంతా కలిసినప్పుడు "ఒకసోదరుడు మనలను వదిలిపోయినాడు, దుఃఖసముద్రంలో ముంచిపోయినాడు అని ఏమేమో చెప్పబోయి దుఃఖం ఆపుకోలేక భోరున ఏడుస్తారు. వాళ్ళంతా వచ్చి మావాళ్ళను ఆదరిస్తారు. నాపేరుతో ఒకచిన్న గ్రంథమండలి లేవదీస్తారు. ఒకపోటీ పరీక్షకూడా పెడితే పెట్టవచ్చు.

నాభార్య నాప్రియురాలు ఎంత ఏడుస్తుందో. దానిదుఃఖం అపారంగదా! గభీర సముద్రంలో తోసినట్లుగదా! ఆవిచారాన్ని ఎవరుచూడగలరు? నాభార్య ఏడుస్తుంటే చూచినవాళ్ళగుండెలు జారిపోతవి.

అబ్బ కాంతాని దుఃఖం తల్చుకొంటే ఏడుపొస్తుంది. గుండె బేజారై పోతుంది. ఇవ్వాడేదో మాటపట్టింపు మీద పోట్లాడింది. నేను మాట్లాడటం మానేస్తే తాను బెట్టుసరికి మాట్లాడటం లేదుకాని దానిహృదయంలో ప్రేమ లేకేమి. పాపం దానిది. అసలేజాలిగుండె. నాచావువింటె ఆకాస్త కరిగినీరైపోతుంది. ప్రవాహంగా పారుతుంది ఆకన్నీటి ప్రవాహంలో నాచిన్నికుమారుడు, పాపం, ఆడుకొంటూ ఉంటాడు వాడికేం తెలుస్తుంది.

ఇతర స్నేహితులంతా ఎంతమంది ఉన్నారు. వాళ్ళంతా పాపం ఎంతఏడుస్తారు. అయ్యో లోకానికి నిజంగా అపకారం జరిగిపోతుందన్నమాట. నాకొంప కూలటమే కాక ఇతరుల కొంపమీదికి కూడా తెచ్చిపెట్టినవాడిని అవుతాను. ఇంతమందిని దుఃఖపెట్టి నేనేమి సుఖపడుతాను? సుఖపడటంఏమిటి? చచ్చినవారికి సుఖంఏమిటి?

నా పేరు ఆంధ్రపత్రికలో వేస్తారేమో! నాబొమ్మ సంచికకు పంపి కీర్తిశేషులయిన మ॥రా॥రా 'నా' చరిత్ర క్లుప్తంగా వ్రాస్తారేమో. ఆ సంవత్సరం ఉన్నంతబాగా సంచిక ఏసంవత్సరం ఉండదంటంలో అతిశయోక్తి ఏమి లేదు. ఎందుచేతనా? నా బొమ్మ ఉందికాబట్టి.

స్కూలులో ఆరోజు స్కూలు మూస్తారు. ఉపాధ్యాయులంతా కంట తడిపెడతారు. ఒక పుస్తక భాండారం నా పేరుతో పెడతారు. అయ్యో లోకానికి ఎంత కష్టం



వస్తుంది! ఇంత కష్టం తెచ్చిపెట్టి చావటం ఎందుకు? మళ్ళీ మొదలా? ఎంతపిచ్చివాణ్ణి. చావటం ఎందుకా? లోకంమీద పగ తీర్చుకొంటానికి. చచ్చి కాంతాన్ని వాళ్ళని ఏడిపించాలని.

బ్రతికిఉన్ననాళ్ళు నన్ను అంతా తిట్టేవాళ్లె బైటలోపల కూడా? చచ్చినతరవాత అయినా అయ్యోఅనరా. ఆవిధంగానయినా పేరు వస్తే రావచ్చు. ఈ లోకుల తిట్లతో తలవాచిపోతున్నది చస్తేనే నయం.

పేరుప్రతిష్టలు సంపాదించాల అంటే వెంటనేచావవోయి" అని ఎవరో ఇంగ్లీషువాడు అన్నాడట. ఆ మాటలో ఎంత నిజం ఉంది? షేక్స్పియరు మహాకవి చచ్చి సంపాదించిన యశమేగాని బ్రతికి సంపాదించాడా ? బ్రతికున్న రోజులలో ఒకాయన ఏమన్నాడంటె 'గాడిద అరుపులో ఎంత అర్థగాంభీర్యము ఎంత సౌందర్యము ఎంత గొప్ప ఉందో షేక్స్పియరులో అంతే ఉంది, అన్నాడు. కీట్సుమాటుకూ ? చచ్చిపోయిన తరువాతనే గొప్పవాడయినాడు. వీళ్ళ లెఖేమిటి. అనేకమంది చనిపోయి గొప్పవాళ్ళు అయినారు. నేనుమాటుకు ఎందుకు కాకూడదు అని పరిపరి విధాల ఆలోచించి ఇటు కాంతాన్ని సాధించినట్లుటుంది. అటు లోకంమీద పగ తీర్చుకొన్నట్లు ఉంటుంది. అని చావటానికి గట్టిగా నిశ్చయించుకొన్నాను.

## ౨

ఈవిధంగా ఆలోచించి కాంతాన్ని పిలిచి కడసారి మాటలు కొన్ని చెప్పి శెలవు పుచ్చుకొందామని 'కాంతం' 'కాంతం' అని పిలిచాను.

కాంతం పలకలేదు. ఇంకా కోపం పోలేదు. అందుచేత నేను మొదట మాట్లాడిచ్చానని బెట్టు ఎక్కువ.

'కాంతం కాంతం'

'ఆ.'

ఇల్లా రా.

వస్తున్నా అన్నది.

నా మనస్సు చివుక్కుమనిపించింది. నేను చావటానికి సిద్ధపడ్డప్పుడుకూడా పిలిస్తే వస్తాను, వస్తానంటుందే అని కోపం వచ్చింది కాని ఆలోచిస్తే పాపం దానికేమి తెలుస్తుంది. నేను చస్తానని తోచింది. సరే వెంటనే మూడు ముక్కలలో చెప్పేదామనుకొన్నాను. అయితే గ్రామ్యభాషలో మాట్లాడుదమా గ్రాంధికంలో మాట్లాడుదామ అని నాలో నేనే తర్కించుకొన్నాను. ఛీ! ఇదివరకంతా గ్రామ్యంలో వ్రాసి మాట్లాడి కావలసినంత పాపం చేశాను. చచ్చిపోయేటప్పుడైనా కొంచెం గ్రాంధికంలో అందామనుకొని "కాంతం చేరువకు రమ్ము నా కంత్యకాల మాసన్నమైనది"

'నన్నుం గావటం ఏమిటి' అంటూ వచ్చింది కాంతం.



కాంతాన్ని చూసేసరికి అదేదో వికారం గలిగింది. చెప్పటానికి నోరు రాలేదు "ఇది గాదు భోజనం చేసినతరువాత ఒక్కమాటు కాంతంతో మాట్లాడి ఆనందం అనుభవించి ఆ మాట కాస్తా చెప్పి చావవచ్చునని మనస్సులో అనుకొని

"ఎబ్బె" నన్నుం గావటం కాదు. ఆకలి అవుతుంది అంటున్నా. నీకు చెముడువల్ల ఇంకెల్లాగో వినిపించింది" అన్నాను.

'చెవుడు కావలసిందే. ఏదో నెపం, పలకరించడానికి. వంట అయింది లేవండి' అన్నది.

భోజనం అయింది. భోజనం కమ్మగా తగిలేటప్పటికి నా నిశ్చితాభిప్రాయము కొంత అడుగునబడ్డది. కాని వెంటనే అంతా జ్ఞాపకం తెచ్చుకొని కాంతంతో చెప్పేద్దామని అన్నానూ. "కాంతం మన సౌఖ్యం ఎన్నాళ్ళు. వెలుగు వెనుకనే చీకటి. పున్నమచంద్రుడెన్నాళ్ళు! అంతా బుద్బుద ప్రాయముగదా!" కాంతానికి అర్థంకాలేదు. ఏమో కొంచెం తెల్లముఖం వేసింది. 'ఏమిటి ఇల్లా ప్రారంభించారు. గోష్టలంగారి సహవాసంవల్ల వచ్చింది ఇది. ఆయన ఏదో "ఘటాకాశం" 'మిథ్యాజగత్తు' అంటూ ఉంటాడు. ఆ దోషం మీకేదో తగిలింది. సాహిత్లో ఒక కథ ఉన్నా చదవండి. మనస్థిమితం కలుగుతుంది" అన్నది.

"అడియాసనుంగాక నే జెప్పబోవునది: అచలచిత్తవై అవధరింపుము" అన్నాను.

"అయ్యబాబో! ఇదేమిటి ఇట్లా మాట్లాడుతున్నారు. నరుసూ-ఒరేయి, ఇట్లారా, గూబావకేమైన పైత్యం మాటలాపమిట్రా వేగంరా! అన్నది. "ఇన్నిరోజులు నీతో సౌఖ్యము నుభవించితిని. నాకీ ఐహికసౌఖ్యములపై ఇష్టముతప్పినది" అన్నాను. కాంతానికి ఏదో గోలగాఉంది. ఏమి తెలియటంలేదు కాబోలు, అన్నది. "ఇష్టంతప్పితే ఇష్టంవచ్చిందే చేయించుకోండి. నేను చెయ్యనన్నానా? మీకిష్టంవచ్చినది చేయుమనండి. చేయకపోతే అప్పుడనండి. ఇప్పటికిఊరుకోండి, నన్నేడిపించకండి".

"పిచ్చిపిల్లా. నేజెప్పునది తెలిసికొనుము. నాకును నీకును ఋణముతీరినది 'ప్రేయసీ ప్రేయసీ నేన నీప్రియుడనే ప్రేయసీ కడసారి ముద్దివ్వవే" అన్నాను. అనేటప్పటికి కాంతం బావురుమన్నది.

'ఛా, దీనితో చెబితే కార్యంలేదని ఊరుకొన్నాను. సాయంత్రం స్నేహితులతో వెళ్ళి ఆసంగతిచెబితే ఒక్కడూ జాలిపడలేదు. ఒకాడూ 'భాయీ వద్దురా' అనలేదు. పైగా వాళ్ళు నవ్వినారు. ఒకరిద్దరు 'ఒరేయి నాకివ్వాలిసిన పైకం ఇవ్వవా మరి అల్లాగయితే' అన్నారు" ఋణంతో మరణించటం ఒప్పలేక అన్నిబాకీలు తీర్చివేశాను. సరేస్వర్గానికి ప్రయాణంకట్టినాను. రేపుప్రయాణం. ఒక్కరాత్రి మధ్యఉంది. ఆ ఒక్కరాత్రి ఇహలోకసౌఖ్యం అంతా అనుభవించాలని అనుకొన్నాను.



రాత్రి కాంతం బెదురుచూపులతో వడ్డించింది. నేనుమటుకు సరసంగానే మాట్లాడేను. చచ్చిపోయేవాడికి కోపం ఎందుకు? ఆరాత్రి పడుకొని నిద్రపోయినాను. రేపుప్రొద్దున చావవలెనని నిశ్చయించుకొన్నాను.

ఆనిద్రలో కలవచ్చింది. ఆకలలో నేను చనిపోయినట్లు మావాళ్ళంతా ఏడ్చినట్టు నేను అవన్నీ ఎల్లాగో మళ్లీ చూస్తూ ఉన్నట్టూ కలగన్నాను. కొంతకాలం జరిగిపోయింది. నాస్నేహితులు నాచావు విన్నారు. ఒక్కరూ కంటతడిబెట్టలేదు. నాపేరున పుస్తకభాండారం లేదు. కొంతమంది చీట్లాట ఆడుతూ ఆనుతూ నాచావువిని అయ్యో! అన్నారు ఆటమటుకు ఆపలేదు. ఇద్దరుముగ్గురుమటుకు ఆమాటవినడంతోనే చప్పునలేచి ఎక్కడికో ప్రయాణం అయినారు. ఎక్కడికి వెళ్ళుతారబ్బా అనుకొని వాళ్ళవెంటనే నేనూవెళ్ళానట. వాళ్ళుఏకాయకిని కాఫీ హోటలుకువెళ్ళి నాల్గుకప్పుల తేనీరు తాగివేశారు.

లోకంలో హడావుడి ఏమీలేదు. ఎప్పటిమోస్తరుగా సూర్యోదయం అవుతున్నది. అందరు ఎప్పటిమోస్తరుగా ఆఫీసుకు వెళ్ళుతున్నారు. జట్కాబండ్లునడుస్తున్నవి.

కాంతంవైపుతిరిగినాను. మొదటిరోజులలో నిజమేపాపం ఏడ్చింది. నిజంగావిచారంచూపించింది. 'నిజమైనభర్త' అని ఒక కథలాంటిది వ్రాసింది. అంతాబాగుందన్నారు. దాన్ని నిజమైనభాగ్యఅనిఅన్నారు. ఆకథలో మేఘాన్నిపిలిచి. 'ఓ మేఘుడా

నీవు ఏకాయకీని మాఇంటికిపో. అక్కడ నాభర్త కుర్చీలో కూర్చుని ఉంటాడు. చదువుకుంటూఉంటాడు. లేనిచో నాఫోటో చూస్తూఉంటాడు." అని మొదలుపెట్టి ఏమేమో వ్రాసింది. కొంతకాలానికి విచారం తగ్గింది.

కల మెలుకువచ్చింది. వెంటనేస్నానంచేసి కాఫీహోటలుకువెళ్లాను. అక్కడ ఒక స్నేహితుడు కనిపించి ఏమిరోయి! నిన్ననాతో చచ్చిపోతారా, మళ్లీకనపడనన్నావు? అన్నాడు. అవునురా, నిన్న అల్లాగేఅనుకొన్నా. కాని దర్మిలా ప్రోగ్రాము మార్చేశా! అన్నానునేను.

# కొత్త ఎత్తు

చంద్రశేఖరం - ఒరే - చంద్రం.

ఏమిటోయి ఏమిటి యిల్లావచ్చావు?

నీకేమయినా బాకీరా నేను?

ఎబ్బే, ఏమి బాకీలేదే? ఎందుకు అల్లా అడిగావు? పాత బాకీలన్నీ తీర్చేస్తున్నావా ఏమిట్రా

ఎబ్బే! లేదురా. నేను ఎవరెవరి దగ్గర ఏమి పుచ్చుకొన్నానో? ఏమి జ్ఞాపకంలేదు: నేను యిదివరలో పుచ్చుకొనని వాళ్లెవరైనా ఉంటే వాళ్లదగ్గర ఏమైన పుచ్చుకొందామని వచ్చా. నీదగ్గర రెండు రూపాయలు ఉంటే యిస్తూ అన్నాడు

చంద్రశేఖరానికి నవ్వువచ్చింది. అతను హేమసుందరానికి అప్పుయిచ్చాడో లేదో తెలియదు. కాని అతని ద్వారా హేమసుందరం జీవితకథ తెలిసింది.

అసలు సుందరం మంచి కుటుంబంలో పుట్టినవాడేట. పాఠశాలాంతర పరీక్షకు వెళ్ళకముందే తలిదండ్రులు కాలంచేశారు. యావదాస్తికి ఇతడొక్కడే వారసుడైనాడు. తనచిత్తం వచ్చినరీతిని ఆస్తిని వ్యయపరచటం మొదలెట్టాడు. కొద్దిరోజులలోనే పిత్రార్జితమైనఆస్తి యావత్తువిక్రయించాడు. ఆసొమ్మెల్లా ఖర్చు అయిందో ఎవరికి తెలియదు.

'కాని అచిరకాలంలో ఆసొమ్మ యీతని చేతులలోనుంచి